సాక్షి కుమురం భీం

శుక్రవారం, 18 ఏప్రిల్ 2025



మన చిత్రం..'జగమెరిగిన సత్యం'

జిల్లాకు చెందిన యువ దర్శకుడు పాలె తిరుపతి చింతలమానెపల్లి దిందా గ్రామం నేపథ్యంలో సినిమా తెరకెక్కించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదల కానుంది. 10లో▸



మబ్బులతో రైతుల్లో గుబులు

రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గురువారం తెల్లవారుజామున పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది. రైతులు ఆందోళన చెందుతున్నారు. 11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.2 /28.9

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేడిగాలులు వీస్తాయి. సాయంత్రం పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అటవీశాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే 'పాల్వాయి'



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌బాబు, రామారావు పటేల్

బెజ్జూర్(సిర్పూర్): హైదరాబాద్‌లో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను గురువారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మర్యాదపూర్వకంగా కలిశారు. పోడు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ పోడు రైతులను అటవీశాఖ అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. బెదిరింపులకు పాల్పడుతూ వారి జీవనాధారాన్ని లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. తునికాకు సేకరణను కూడా అడ్డుకుంటున్నారని తెలిపారు. స్పందించిన మంత్రి పోడు రైతులకు ఇబ్బందులకు గురిచేయొద్దని పీసీసీఎఫ్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు డోబ్రియల్‌ను ఆదేశించారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

దహెగాం: గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడలతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గెర్రె గ్రామంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఇరవై రోజులుగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. గురువారం జరిగిన ఫైనల్‌లో గెర్రె జట్టు మంచిర్యాల జిల్లా కన్నెపల్లి జట్టు తలపడగా కన్నెపల్లి జట్టు విజేతగా నిలిచింది. బహుమతులు ప్రదానం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పలు రాజకీయ పార్టీలు యువతతో జెండాలు మోయించి మత్తుకు అలవాటు చేశాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్ క్రీడలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. గ్రామీణ యువత చెడు వ్యసనాలు వీడి, విద్య, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు దందెర మల్లేశ్, షాకీర్, నాగుల లక్ష్మి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువ కావాలి



పరికరాలు పరిశీలిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

కెరమెరి(ఆసిఫాబాద్): పోలీసులు ప్రజలకు మరింత చేరువ కావాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. సిబ్బంది విధుల గురించి ఎస్సై విజయ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేసులకు సంబంధించిన ఫైళ్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ ప్రజల సమస్యలు ఓపికగా విని పరిష్కరించాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి గ్రామాలపై అవగాహన ఉండాలన్నారు. ప్రజలతో మమేకమై వారితో స్నేహ సంబంధాలు మెరుగుపర్చుకోవాలన్నారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి ప్రతిఫలం దక్కుతుందని పేర్కొన్నారు.

ఆదివాసీలు హక్కులు సాధించుకోవాలి



తుడుందెబ్బ ప్రతినిధులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదివాసీలు ఏకతాటిపైకి వచ్చి హక్కులు సాధించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, ఆ పార్టీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహించిన సమావేశాల్లో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కోట్నాక విజయ్, వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్స పోచయ్యను గురువారం జిల్లా కేంద్రంలో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పెంటయ్య, నాయకులు ప్రసాద్‌గౌడ్, దీపక్, మాటూరి జయరాజ్, మురళీగౌడ్, శ్రీకాంత్, శంకర్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



కనర్గాంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను పరీక్షిస్తున్న ఆర్‌బీఎస్‌కే సిబ్బంది

కంటి'పాప'లకు పరీక్షలు

- చిన్నారుల్లో నేత్ర, మానసిక సమస్యలు గుర్తింపు
- ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు
- జిల్లాలో 973 అంగన్‌వాడీ కేంద్రాలు
- జూన్ వరకు కొనసాగనున్న ప్రక్రియ

వాంకిడి(ఆసిఫాబాద్): ప్రాథమిక దశలోనే కంటి, మానసిక సమస్యలు గుర్తించి చికిత్స అందించేందుకు ఈ నెల 7 నుంచి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు వైద్యారోగ్య శాఖ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తోంది. మొదటి విడతలో ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే విద్యార్థులకు, రెండో విడతలో 5, 6, 7 తరగతుల విద్యార్థులకు రక్తహీనతపై స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందుల అందించి చికిత్స చేయించారు. మూడో విడతలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకునే ఆరేళ్లలోపు పిల్లల్లో మానసిక, కంటి సమస్యలను గుర్తించి తక్షణ చికిత్స అందించేలా కార్యాచరణ రూపొందించారు. ఈ నెల 7న ప్రారంభమైన కార్యక్రమం జూన్ వరకు వంద రోజులపాటు కొనసాగనుంది.

సమస్యలు గుర్తించేందుకు 42 ప్రశ్నలు..

జీవన విధానంలో వస్తున్న మార్పులు, ఆహారపు అలవాట్లతో బాల్యంలోనే పిల్లలకు అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. చిన్న పిల్లల్లో కంటి, మానసిక సమస్యలను గుర్తించడానికి అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. త్వరగా అర్థం చేసుకుని సమాధానం చెప్పేలా మొత్తం 42 సులువైన ప్రశ్నలు రూపొందించారు. ముందస్తుగా అంగన్‌వాడీ టీచర్లు పిల్లల తల్లిదండ్రులకు సమాచారం అందిస్తారు. పిల్లలను తల్లిదండ్రులతోపాటు కూర్చోబెట్టి బొమ్మలతో కూడిన చిత్రాలను చూపిస్తూ ప్రశ్నలు అడుగుతారు. ఆ సమయంలో పిల్లల నుంచి వచ్చే సమాధానాలకు అనుగుణంగా సమస్యను గుర్తిస్తారు. పిల్లల్లో ఎదుగుదల లోపాలు, జన్యుపరమైన సమస్యలతోపాటు కంటిలో వచ్చే కార్నియా, మెల్లకన్ను, తదితర సమస్యలు గుర్తిసారు. ఆ తర్వాత మందుల పంపిణీ చేయడం లేదా ఆస్పత్రిలో చేర్పించేందుకు చర్యలు చేపడతారు. కంటి సమస్య ఎక్కువగా ఉంటే అద్దాలు అందజేస్తారు. శస్త్ర చికిత్స కూడా చేయిస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 7 నుంచి ఇప్పటివరకు వరకు సుమారుగా 2,500 మందికిపైగా పిల్లలను పరీక్షించారు. ఇందులో దృష్టిలోపం ఉన్న వారు ముగ్గురు, ఇతర నేత్ర సంబంధ ఇబ్బందులు 13 మందికి ఉన్నట్లు గుర్తించారు. వారందరికీ ఉచితంగా చికిత్స చేయించి కళ్లద్దాలు అందజేయనున్నారు.

ప్రతిరోజూ 150 మందికి..

చిన్నారుల్లో కంటి, మానసిక రుగ్మతలు నిర్మూలించేందుకు 100 రోజులపాటు జిల్లా వ్యాప్తంగా మూడు బృందాలు పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఒక్కొక్క బృందంలో ఇద్దరు డాక్టర్లు, ఒక ఫార్మసిస్ట్, ఒక ఏఎన్‌ఎం, ఒక అప్తోమెట్రిస్ట్ ఉంటారు. ఒక్కొక్క బృందంలోని సభ్యులు ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. ఒక్క రోజులో 150 మంది పిల్లలను పరీక్షిస్తారు. జిల్లాలో 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 41,782 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించా రు. రోజుకు 150 మంది చొప్పున వంద రోజుల్లో పరీక్షలు పూర్తి చేయనున్నారు. అయితే ఆర్‌బీఎస్‌కే బృందాలు పది ఉన్నా అప్తోమెట్రిస్ట్‌లు తక్కువగా ఉండటంతో జిల్లాలో మూడు బృందాలు మాత్రమే పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మూడు నెలల్లో లక్ష్యం పూర్తి కావడం కష్టంగా మారింది. కంటి పరీక్షలు చేసే నిపుణులను నియమించుకుంటే గడువులోగా లక్ష్యాన్ని చేరుకోవచ్చు.

అన్ని కేంద్రాల్లో పరీక్షలు

జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల్లో కంటి, మానసిక సమస్యలు గుర్తించేలా కార్యాచరణ రూపొందించాం. వాంకిడి, ఆసిఫాబాద్, రెబ్బెన, కాగజ్‌నగర్ మండలాల్లో ఆర్‌బీఎస్‌కే ప్రత్యేక బృందాలు పరీక్షలు నిర్వహిస్తున్నాయి. సమస్యలు ఉన్న పిల్లలకు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తాం. అలాగే అవసరమైన వారికి కళ్లద్దాల పంపిణీ చేస్తాం. ప్రభుత్వం ఉచితంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సీతారాం, డీఎంహెచ్‌వో

భూభారతితో సత్వర పరిష్కారం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

వాంకిడి(ఆసిఫాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి ఆర్‌వోఆర్ చట్టం ద్వారా భూసమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు అదనపు కలెక్టర్(రెవెన్యూ) డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని, నిజమైన భూమి యజమానికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం ఉందని, సమస్యల పరిష్కారంలో అప్పీల్ వ్యవస్థను తీసుకువచ్చినట్లు వివరించారు. తహసీల్దార్ జారీ చేసిన ఆర్డర్‌పై ఆర్డీవోకు, ఆ ఆర్డర్‌పై కలెక్టర్‌కు అప్పీలు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ధరణి పోర్టల్‌లో ఈ అవకాశం లేదని, విరాసత్ పట్టా మార్పిడిపై సంబంధిత పట్టాదారులకు నోటీసులు జారీ చేసే విధానం అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. కొనుగోలు, తనాఖా, దానం, పాలు పంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులో మార్పులు చేసి పట్టాదారుకు పాసు పుస్తకం జారీ చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియ ఒకే రోజులో పూర్తయ్యేలా చట్టంలో పొందుపరిచినట్లు వివరించారు. ప్రతీ రైతు హక్కులు, అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏవో గోపికాంత్ తదితరులు పాల్గొన్నారు.

28 వరకు అవగాహన సదస్సులు

ఆసిఫాబాద్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 17 నుంచి 23 వరకు జిల్లాలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు కాగజ్‌నగర్‌లోని రైతు వేదిక, మధ్యాహ్నం 2 గంటలకు సిర్పూర్- టి రైతు వేదిక, 22న ఉదయం 10 గంటలకు జైనూర్, మధ్యాహ్నం 2 గంటలకు కెరమెరి, 23న ఉదయం 10 గంటలకు బెజ్జూర్, మధ్యాహ్నం 2 గంటలకు చింతలమానెపల్లి, 24న ఉదయం 10 గంటలకు లింగాపూర్, మధ్యాహ్నం 2 గంటలకు సిర్పూర్- యూ, 25న ఉదయం 10 గంటలకు పెంచికల్‌పేట్, మధ్యాహ్నం 2 గంటలకు కౌటాల, 26న ఉదయం 10గంటలకు తిర్యాణి, మధ్యాహ్నం 2 గంటలకు రెబ్బెన, 28న ఉదయం 10 గంటలకు దహెగాం, మధ్యాహ్నం 2 గంటలకు ఆసిఫాబాద్‌లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

'ఎల్‌ఆర్‌ఎస్' చెల్లింపులు వేగవంతం చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో అందిన దరఖాస్తుల్లో అర్హులైన వారు రుసుము చెల్లించేలా ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర పురపాలిక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులతో ఎల్‌ఆర్‌ఎస్ రుసుం వసూలు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 25శాతం రాయితీతో రుసుము చెల్లించే గడువు ఈ నెల 30 వరకు ఉందని తెలిపారు. రుసుము చెల్లించిన వారికి ప్రొసీడింగ్ అందించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వెంకటేశ్ దోత్రే మాట్లాడారు. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ పథకం కింద 7,212 దరఖాస్తులు అందాయని, విచారణ అనంతరం 5,470 అర్హులైన దరఖాస్తుదారులు రుసుము చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు 1,022 మంది రుసుము వసూలు చేసేలా కార్యదర్శులు, వార్డు అధికారుల ద్వారా సంప్రదించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రుసుము చెల్లించిన 328 మందికి ప్రొసీడింగ్స్ అందించామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీపీవో భిక్షపతిగౌడ్, పట్టణ ప్రణాళిక అధికారి యశ్వంత్, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నాణ్యతతో ఇళ్లు నిర్మించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కౌటాల(సిర్పూర్): నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని నాగేపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణ పనుల ఫొటోలను యాప్‌తోపాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పనులు ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పరిశీలించాలన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువవికాసం కౌంటర్లలో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తుల వివరాలు పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో చేపట్టిన ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో కోట ప్రసాద్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీవో పూర్ణిమ తదితరులు ఉన్నారు.

యువ కార్మికులు అంకితభావంతో పనిచేయాలి

- జీఎం విజయ భాస్కర్‌రెడ్డి



ఉద్యోగ నియామక పత్రాలు ఇస్తున్న జీఎం విజయ భాస్కర్ రెడ్డి, అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో నూతనంగా ఉద్యోగాలు పొందుతున్న యువ కార్మికులు అంకితభావంతో పనిచేసి సంస్థ పురోభివృద్ధికి తోడ్పాటును అందించాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ ఆవరణలో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన వారికి గురువారం నియామక పత్రాలు అందించారు. జీఎం మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగంలో చేరే యువకులు సంస్థ ఖ్యాతిని పెంచాలన్నారు. సింగరేణిలో ఉద్యోగం లభించడం అదృష్టంగా భావించాలని, క్రమశిక్షణతో పనిచేసి ఉత్పత్తి, ఉత్పాదకత, లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని సూచించారు. సింగరేణి సంస్థ ఉద్యోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు మరే కంపెనీ కల్పించడన్నారు. విధులకు గైర్హాజరు కావొద్దన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్యా మొగిళి, కైరిగూడ పీవో నరేందర్, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, డీజీఎం ఉజ్వల్‌కుమార్, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ప్రాజెక్టు ఇంజినీరు వీరన్న, డీవైపీఎం వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ పెళ్లికి ఊరంతా సాయం



ఆర్థికసాయం అందిస్తున్న గ్రామస్తులు

లింగాపూర్: ఆడ బిడ్డ పెళ్లికి ఊరంతా ఏకమయ్యారు. ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు.. మండల కేంద్రానికి చెందిన గణపత్‌రావు, సుమిత్రాబాయి దంపతుల రెండో కుమార్తెకు పెళ్లి నిశ్చయమైంది. ఈ వివాహానికి గంగుపటేల్ ఆధ్వర్యంలో పలు కుటుంబాలకు చెందిన వారు గురువారం రూ.24,000 ఆర్థికసాయం అందించాయి. కార్యక్రమంలో బాదిరావు, మహాదు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

టీకాతోనే పశువులకు రక్ష!

- 'గాలికుంటు' నివారణకు టీకాలు
- నెల రోజులపాటు కొనసాగనున్న కార్యక్రమం
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన
- జిల్లాలో 3.1 లక్షల పశువులు

జిల్లా వివరాలు

తెల్ల, నల్ల పశువులు 3,13,896	
వైద్యబృందాలు 25	సిబ్బంది 75 మంది



కౌటాలలో దూడకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

కౌటాల(సిర్పూర్): ఏటా వివిధ రకాల వ్యాధులతో పశువులు, జీవాలు వందల సంఖ్యలో మృత్యువాత పడుతుండటంతో పోషకులు, రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పశువుల మరణాలు అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఏటా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం చేపడుతోంది. ఈ నెల 15 నుంచి జిల్లాలో ప్రారంభమైన టీకాల కార్యక్రమం మే 15 వరకు కొనసాగనుంది. పశువులకు సోకే వ్యాధులపై పాడి రైతులు అవగాహన కలిగి ఉంటూ సకాలంలో నివారణ టీకాలు వేయించాలని అధికారులు సూచిస్తున్నారు.


వ్యాధి లక్షణాలు ఇలా..

గాలికుంటు వ్యాధి సూక్ష్మక్రిములతో వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన గేదెలు, ఆవులు 24 గంటలోగా బక్కచిక్కి అల్సర్ బారిన పడతాయి. రెండు నుంచి ఆరు రోజుల వరకు జ్వరం ఎక్కువగా ఉంటుంది. నోరు, పెదాలు, నాలుక, చన్నులతోపాటు కాళ్ల గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి వ్యాధి ముదురుతుంది. వ్యాధి బారిన పడిన పశువులు ముడుచుకుని పడుకుంటాయి. మేత, నీళ్లకు దూరంగా ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తి తగ్గడంతో పశువులు, దూడలు చనిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఇలాంటి వాటికి క్రమం తప్పకుండా పరీక్షలు చేయించాలి. నోరు, పెదాలు, నాలుక, కాళ్ల గిట్టల వద్ద ఉన్న పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ లేదా నార్మల్ సెలైన్ నీటితో శుభ్రం చేయాలి. రెండోసారి ఇన్‌ఫెక్షన్ రాకుండా యాంటీ బయాటిక్స్ మందులు, వ్యాధి నిరోధక శక్తి పెంచేందుకు బీ కాంప్లెక్స్ మందులు వాడాలని పశువైద్యులు సూచిస్తున్నారు. పశువులకు గాలి ద్వారా సోకే గాలికుంటు వ్యాధిపై రైతులు నిర్లక్ష్యం వహించకుండా పశు సంవర్ధక శాఖ వైద్యుల సలహా మేరకు క్రమం తప్పకుండా ఏడాదికి రెండుసార్లు టీకాలు వేయించాలి. గాలికుంటు ప్రాణాంతకమైన వ్యాధి కావడంతో చిన్నపాటి అలసత్వం చేసినా పశువు మృతి చెందే ప్రమాదం ఉంటుంది. వ్యాధి బారిన పడిన పశువులను ఇతర వాటికి దూరంగా ఉంచాలి. ఎప్పటికప్పుడు పశువుల పాకను శుభ్రం ఉంచాలి. వారానికి ఒకసారి కొట్టంలో సున్నం చల్లి, క్రిమికీటకాల నివారణకు చర్యలు తీసుకోవాలి. వ్యాధి సోకిన గేదె, ఆవు నుంచి తీసిన పాలను 100 డిగ్రీల సెల్సియస్ వరకు వేడి చేసిన తర్వాతే తాగాలి. పశువు చనిపోతే గోతిలో వేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి పాతిపెట్టాలి.

ఏటా రెండుసార్లు..

వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమతో రైతులు ఆర్థికంగా బలపడుతున్న నేపథ్యంలో వారు నష్టపోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతీ సంవత్సరం రెండుసార్లు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. జిల్లాలో రెండు ఏరియా పశువైద్యశాలలు ఉండగా 18 ప్రాథమిక పశువైద్యాశాలలు ఉన్నాయి. ఏడు పశువైద్యాశాల సబ్‌సెంటర్లు ఉన్నాయి. ఆవులు, గేదెలు మొత్తం 3,13,896 ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో ఈ నెల 15 నుంచి మే 15 వరకు నెల రోజులపాటు టీకాలు వేయనున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. షెడ్యూల్ ప్రకారం ప్రతీరోజు ఉదయం 6 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు గ్రామాల్లోకి వెళ్లి టీకాలు వేస్తున్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఈ నెల 15 గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రారంభించాం. షెడ్యూల్ ప్రకారం మే 15 వరకు అన్ని గ్రామాల్లోని పశువులకు ఉచితంగా టీకాలు వేస్తాం. పశు పోషకులు, రైతులు స్వదినియోగం చేసుకోవాలి. టీకాలు వేయించడం ద్వారా పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. మేకలు, గొర్రెలు, పశువులకు ఎలాంటి వ్యాధులు సోకినా పశువైద్యశాఖ సిబ్బందికి సమాచారం అందించాలి.

– సురేశ్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

క్లుప్తంగా

దాడి కేసులో ఇద్దరు రిమాండ్

జన్నారం: అటవీశాఖ మహిళ బీట్ అధికారి వి ధులకు ఆటంకం కలిగించడమే కాకుండా ఆమెతోపాటు భర్తపై దాడి చేసిన కేసులో ఇద్దరిని గు రువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఈనెల7న జన్నారం మండలం కొత్తపేట సమీపంలో ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా బీట్ అధికారి రుబీనా తలాత్ ఆపింది. ఆమె తోపాటు భర్త అఫ్రోజ్ వెళ్లాడు. నా ట్రాక్టర్‌ను ఆపుతావ అని కవ్వాల్ గ్రామానికి చెందిన రి యాజొద్దీన్, ఎజాజొద్దీన్‌లు బీట్ అధికారి విధులకు ఆటంకం కలిగించాడు. ఆమె భర్తపై దాడి చేయడంతో కేసు నమోదైంది. విచారణ అనంతరం కోర్టులో హాజరుపర్చగా ఇద్దరిని 14 రోజులు రిమాండ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

భార్యపై గొడ్డలి దాడి ఘటనలో భర్తకు..

కోటపల్లి: వివాహేతర సంబంధంపై ప్రశ్నించిన భార్యపై గొడ్డలితో దాడి చేసిన ఘటనలో నిందితుడు భర్తను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన బానోత్ పున్నం తన వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్న భార్య లక్ష్మిని గొడ్డలితో దాడిచేసి గాయపర్చాడు. నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

నెన్నెల: మండలంలోని మైలారం మత్తడి వాగు నుంచి అనుమతి లేకుండా బెల్లంపల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను జోగాపూర్ వద్ద పట్టుకున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. బుధవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఈ ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశామన్నారు. యజమానులు గడ్డం సాయికుమార్, కొమ్ము రాజన్న, డ్రైవర్లు పసుల రవీందర్, అత్తి సాయిలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం



కాలిపోయిన వస్తువులు

తాంసి: మండలంలోని జామిడికి చెందిన పర్ధాన్ దేవుబాయి ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఒంటరిగా ఉంటున్న ఆమె గురువారం ఉదయం ఇంట్లో దేవుని చిత్రపటం వద్ద దీపం పెట్టి ఉపాధి పనికి కూలీలతో వెళ్లింది. వెలిగించిన దీపం వస్తువులకు అంటుకొని మంటలు వ్యాపించింది. గమనించిన గ్రామస్తులు వెంటనే మోటార్ల ద్వారా నీటిని చల్లి మంటలార్పివేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, దుస్తులు, రూ.20వేల నగదు కాలిపోయాయి. ఇంటి పైకప్పు దెబ్బతింది. దాదాపు రూ.లక్షకు పైగా ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి ఘటనస్థలానికి చేరుకుని బాధిత మహిళను పరామర్శించారు. నెలకు సరిపడా సరుకులతోపాటు నగదు అందజేశారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు అశోక్ ఆర్థికసాయం అందజేశాడు.



సినిమా చిత్రీకరణలో నటీనటులు

మన చిత్రం..
జగమెరిగిన సత్యం

- చింతలమానెపల్లి మండలం దిందా గ్రామంలో చిత్రీకరణ
- దర్శకుడు, నటులూ స్థానికులు..
- నేడు విడుదల

సినిమా అంటే ఒక క్రేజ్.. రంగులతో కనిపించే సినిమా చాలామందికి కల.. ఇలాంటి ఓ సినిమా మన ప్రాంతంలో రూపుదిద్దుకుంటే ఆ ఆనందం వేరు. ఎలాంటి ప్రాచుర్యానికి నోచుకోని ఆ గ్రామంలోని వెనుకబడిన పరిస్థితులు, గ్రామస్తుల సహజ అమాయకత్వం ఈనేపథ్యంలో చింతలమానెపల్లి మండలంలోని దిందా గ్రామ కేంద్రంగా రూపుదిద్దుకున్న చిత్రం.. జగమెరిగిన సత్యం..ఈనెల 18న సినిమా విడుదల కానుంది.

చింతలమానెపల్లి: మండలంలోని దిందా.. ఒక మారుమూల గ్రామం.. త్వరలో రంగస్థలానికి పరిచయమవుతోంది. దట్టమైన అటవీ ప్రాంతంలో రవాణా సౌకర్యాలకు, గ్రామం అభివృద్ధికి నోచుకోకుండా ఉంది. జగమెరిగిన సత్యం టైటిల్‌తో విడుదల అవుతున్న చిత్రం 80 శాతం గ్రామంలోనే చిత్రీకరించారు. గ్రామ సమీపంలోని వాగు, చింతలమానెపల్లి మండలం రవీంద్ర నగర్ వారసంత, గూడెం ప్రాణహిత నది వంతెన, పెంచికల్‌పేట్ పెద్దవాగు, కౌటాల మండల కేంద్రం, పక్కనే మహారాష్ట్రలోని అహేరి వద్ద కొన్ని సన్నివేశాలను తెరకెక్కించారు. కౌటాల ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో మొదటి సన్నివేశం చిత్రీకరణతో సినిమా ప్రారంభించారు.

1994లో గ్రామీణ పరిస్థితుల నేపథ్యం..

1994లోని గ్రామీణ నేపథ్యం, అప్పటి మనుషుల కట్టుబాట్లు, దర్శకుడి చిన్నతనంలోని అనుభవాలను ఆధారంగా చిత్రం రూపొందింది. ప్రేమ సన్నివేశాలు, భావోద్వేగాలు, సంస్కృతి, సంగీతం ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు దర్శకుడు పాలె తిరుపతి తెలిపారు. ఇందులో పలు సన్నివేశాల్లో దిందా గ్రామస్తులను బ్యాక్‌గ్రౌండ్‌లో నటించేందుకు అవకాశం కల్పించారు. సినిమాలో ఐదు పాటలు ఉండగా బతుకమ్మ పాటను గాయకురాలు మంగ్లీ ఆలపించారు. రాణా దగ్గుబాటి, సాయిపల్లవి నటించిన విరాట పర్వం చిత్రానికి పనిచేసిన సురేష్ బొబ్బిలి ఈచిత్రానికి సంగీత దర్శకత్వం వహించారు. హీరో రవితేజ మేనల్లుడు అవినాష్‌వర్మ, ఆద్యారెడ్డిలను హీరో, హీరోయిన్లుగా తొలిపరిచయం చేశామని, మరో హీరోయిన్‌గా నీలిమ పతకంశెట్టి నటించినట్లు దర్శకుడు తెలిపారు.

జిల్లాలో ఆలస్యంగా విడుదల

జగమెరిగిన సత్యం సినిమా కుమురం భీం జిల్లాలో కాస్త ఆలస్యంగా విడుదల కానుంది. ఈనెల 18 (శుక్రవారం)న మంచిర్యాలలో, తెలంగాణలో 33 థియేటర్లలో విడుదల చేస్తున్నారు. కాగజ్‌నగర్‌లో ఇతర సినిమాలకు ముందుగానే షెడ్యూల్ ఖరారు అయి ఉండడంతో కొన్నిరోజుల అనంతరం విడుదల అవుతుందని సినిమా బృందం తెలిపింది.

దర్శకుడు స్థానికుడే..

దర్శకుడు పాలె తిరుపతి స్వగ్రామం పెంచికల్‌పేట్ మండలం చెడ్వాయి. ఆయనకు చింతలమానెపల్లి మండలంలో బంధువులు ఉండగా వారి ఇంటికి వచ్చేక్రమంలో స్థానిక గ్రామాలపై పరిచయం ఉండగా సినిమా చిత్రీకరణకు కారణమైంది. గ్రామంలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన మంచిర్యాలలో డిగ్రీ పూర్తిచేశారు. సినిమాలపై ఆసక్తితో చిత్రరంగానికి వెళ్లి దర్శకత్వ శాఖలో 8 ఏళ్లు పనిచేశారు. ఈక్రమంలో 'కొరియన్ శీర్షిక అహేరి'పేరుతో లఘు చిత్రం రూపొందించారు. అది సాధించిన విజయం ఇచ్చిన స్ఫూర్తితో మరో నాలుగు లఘు చిత్రాలను రూపొందించగా, ఈ అనుభవంతో జగమెరిగిన సత్యం చిత్రాన్ని తెరకెక్కించారు. కథానాయకుడికి చిన్నతనంలో సోదరుడిగా చింతలమానెపల్లి మండలం గంగాపూర్‌కు చెందిన దండ్రె మణికంఠ(బబ్లూ) బాలనటుడిగా నటించాడు.



నటులకు సీన్ వివరిస్తున్న దర్శకుడు పాలె తిరుపతి

గర్వంగా భావిస్తున్నాం



దిందా గ్రామం పేరు వెండితెరపై వినిపించడం పట్ల మేము గర్వంగా భావిస్తున్నాం. స్థానికంగా చిత్రీకరణ జరగడంతో కొంతమందికి ఉపాధి లభించింది. అటవీ ప్రాంతంలో ఉండే మా గ్రామం అభివృద్ధిలో వెనుకబడి ఉంది. సినిమాతో గ్రామానికి ప్రచారం లభించడం మేము సంతోషంగా ఉన్నాం.

– దోకె రామన్న, దిందా

సహకారం అందించాం



సినిమా చిత్రీకరణకు అనువైన ప్రదేశాల కోసం సోదరుడు అయిన డైరెక్టర్ నన్ను సంప్రదించారు. ఎన్నో ప్రాంతాలను పరిశీలించి దిందా గ్రామాన్ని ఎంపిక చేసుకున్నాం. సినిమా చిత్రీకరణ పూర్తయ్యే వరకు సినిమా బృందానికి నాతో కలిసి గ్రామస్తులు, స్థానిక ప్రజలు సహకారాలు అందించాం. సినిమా విజయవంతం కావాలని కోరుకుంటున్నాం.

– దేవాడి రాజన్న, గంగాపూర్

బాలనటుడిగా మరిచిపోలేనిది



సినిమాలో నటించే అవకాశం రావడం ఒక వరం లాంటిది. నేను 8వ తరగతి చదువుకునే సమయంలో దగ్గరి బంధువు అయిన సినిమా దర్శకుడు అవకాశం కల్పించారు. నటనలో అనుభవం లేకున్నా దర్శకుడు, నటుల సహకారంతో బాలనటుడిగా నటించాను. ఈ అనుభవం మరిచిపోలేనిది.

– దండ్రె మణికంఠ(బబ్లూ), గంగాపూర్

ఓపెన్ 'పది', ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 20నుంచి ప్రారంభమయ్యే ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఉదయం 9నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంచిర్యాలలో పదో తరగతికి రెండు పరీక్ష కేంద్రాలు, ఇంటర్ పరీక్షలకు మూడు, బెల్లంపల్లిలో పదో తరగతికి ఒకటి, ఇంటర్‌కు రెండు కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులు 666, ఇంటర్ విద్యార్థులు 1192 మంది పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు స్టడీ సెంటర్ల ద్వారా పంపిణీ చేస్తామని, విద్యార్థులతోపాటు సిబ్బంది పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి పరికరాలు, సెల్‌ఫోన్లు తీసుకు రావద్దని సూచించారు.

న్యాయవాదిపై దాడి దుర్మార్గపు చర్య



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మంచిర్యాలక్రైం: న్యాయవాదులపై దాడులు దుర్మార్గపు చర్య అని మంచిర్యాల జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు అన్నారు. ఈ నెల 16న సూర్యాపేట జిల్లా న్యాయవాది మాంతపురం కిషోర్‌పై దాడిని ఖండిస్తూ గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భుజంగ్‌రావు, న్యాయవాదులు మాట్లాడుతూ దాడులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తుల అంజనేయులు, ధత్తు, గోపతిరవి, శ్రీరాములు, జాడీ తిరుపతి, శ్రీకాంత్ తదిరులు పాల్గొన్నారు.

విధుల బహిష్కరణ

లక్సెట్టిపేట: న్యాయవాది కిషోర్‌పై దాడిని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు విధులు బహిస్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షులు నళినికాంత్, కోశాధికారి సుమన్ చక్రవర్తి, న్యాయవాదులు భూమరెడ్డి, సురేందర్, అక్కల శ్రీధర్, కిరణ్‌కుమార్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య



పోశెట్టి మృతదేహం

సారంగపూర్: ఒంటరితనం భరించలేక వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కుటుంబీకులు, ఎస్సై తెలిపిన వివరాలు.. మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన తోకల పోశెట్టి(65)కి ఇద్దరు భార్యలు ఉన్నారు. పెద్ద భార్యకు ఇద్దరు కుమార్తెలు, చిన్న భార్యకు ఒక కుమార్తె ఉన్నారు. అయితే గత 20 ఏళ్లుగా కుటుంబానికి దూరంగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. స్థానిక హనుమాన్ ఆలయంలో వంట, బస చేస్తూ కాలం వెళ్లదీశాడు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురికావడంతో తిరిగి ఇంటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులకు ముఖం చూపించలేక, ఒంటరిగా బతకలేక తనలో తానే కుమిలిపోయాడు. ఈక్రమంలో రెండు రోజులుగా పోశెట్టి కనిపించడం లేదని గ్రామస్తులు అనుకుంటున్నారు. గ్రామశివారు ప్రాంతంలోని దడే గుట్ట వద్ద ఒర్రె వైపు పశువులు మేపేందుకు వెళ్లిన వారికి గురువారం పోశెట్టి ఉరేసుకుని కనిపించాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు, ఆయన కుటుంబీకులకు చేరవేశారు. గ్రామస్తులు అందించిన సమాచారంతో ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత..



గడ్డం లావణ్య(ఫైల్)

నెన్నెల: ఆర్థిక ఇబ్బందులతో వివాహిత బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గడ్డం లావణ్య (47), భర్త శంకర్ గౌడ్‌తో కలిసి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట హోటల్ నిర్వహిస్తోంది. హోం లోన్ తీసుకుని ఇల్లు నిర్మించుకున్నారు. హోటల్ పెట్టుబడి కోసం మరికొంత అప్పు చేశారు. వ్యాపారం సరిగ్గా సాగక పోవడంతో అప్పు తీర్చడం కష్టమైంది. కిస్తీలు చెల్లించకపోవడంతో వడ్డీ పెరిగిపోయింది. అప్పులు ఎలా తీర్చాలో అని ప్రతిరోజు బాధపడేదని కుటుంబీకులు చెప్పారు. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామున లావణ్య ఇంట్లో కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు చుటూ పక్కల వెతకగా ధీరన్నమ్రి సమీపంలోని వ్యవసాయ బావి వద్ద ఆమె చెప్పులు లోట కనిపించాయి. అనుమానంతో బావిలో నీటిని మోటార్ల ద్వారా తోడగా అందులో శవమై కనిపించింది. కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం

దహెగాం: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. మండలంలోని కోత్మీర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై కందూరి రాజు కథనం ప్రకారం..దహెగాం మండలం కోత్మీర్ గ్రామానికి చెందిన బొలిశెట్టి వెంకటేశ్‌కు కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లికి చెందిన జ్యోతితో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. వెంకటేశ్ సింగరేణికార్మికుడిగా బెల్లంపల్లిలో పనిచేస్తున్నాడు. వీరి కాపురం సాఫీగా సాగింది. ఏడాది క్రితం నుంచి భర్త, అత్త భాగ్య, మామ మొండయ్య అదనపు కట్నం తేవాలని ఆమెను వేధించసాగారు. బుధవారం వేధించడంతో భరించలేని జ్యోతి అందరి ముందే పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబీకులు చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతుంది. జ్యోతి తల్లి పెర్క సుశీల ఫిర్యాదుతో భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి



అశోక్ (ఫైల్)

దండేపల్లి: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన రైతు గాండ్ల అశోక్ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. ఎస్సై తహసీనొద్దీన్ కథనం ప్రకారం.. అశోక్ (45) గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. చాలాసేపటి వరకు రాకపోవడంతో ఫోన్ చేస్తే ఇంట్లో ఉంది. దీంతో బంధువు అయిన కార్తీక్‌ను పొలం వద్దకు పంపించారు. పొలం ఒడ్డున ఒక చెప్పు, బావిలో మరో చెప్పు కనిపించింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ఈతగాళ్లతో బావిలో వెతకగా మృతదేహం లభించింది. ప్రమాదవశాత్తు బావిలో జారిపడటంతో ఈత రాక అందులో మునిగి చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శైలజ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బ్లేడ్‌తో గొంతుకోసి హత్యాయత్నం

ఆదిలాబాద్‌రూరల్: బ్లేడ్‌తో ఒకరి గొంతు కోసి హత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని బంగారుగూడలో చోటుచేసుకుంది. ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం..బంగారుగూడకు చెందిన ముద్దంగుల విఠల్, ఆదేకాలనీలో జాబిర్‌షా ఉంటున్నాడు. గురువారం విఠల్ ఫోన్‌లో ఓ నంబర్ డయల్ చేయాలని జాబిర్ షా అడిగాడు. ఇందుకు విఠల్ నిరాకరించడంతో బ్లేడ్‌తో ఆయన గొంతుకోసి హత్యాయత్నం చేశాడు. తీవ్ర గాయాలైన విఠల్‌ను రిమ్స్‌కు తరలించారు. బాధితుడి భార్య పోచవ్వ ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఆరుగురి బైండోవర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆరుగురు పాత నేరస్తులను గురువారం తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. వేంపల్లిలో దోపిడీ కేసులో నిందితులైన రమేశ్, అవినాశ్, చందు, సంతోశ్, అశోక్, కృష్ణలను ఏడాదిపాటు షరతులతో కూడిన బైండోవర్ చేశారు.

తల్వార్‌తో ఫొటో దిగిన ఇద్దరిపై కేసు

గుడిహత్నూర్: బర్త్ డే పార్టీలో తల్వార్‌తో ఫొటో దిగి సోషల్ మీడియాలో షేర్ చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ భీమేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన యువకులు తరుణ్ గిత్తే, సునీల్ బుధవారం రాత్రి మహంకాళి మందిరం వద్ద జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసిన అనంతరం వేడుకకు హాజరైన మండల కేంద్రానికి చెందిన మిత్రులు నరేశ్, వెంకటి తల్వార్లతో ఫొటోలకు ఫోజు ఇచ్చారు. సోషల్ మీడియాలో షేర్ చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఉండడంతో వీరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆయుధాలతో ఫొటో, వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టులు చేస్తే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని కుమార్‌పేట్‌కు చెందిన తోకల నాగరాజు అశోక్‌రోడ్‌లోని తన పాన్‌షాప్‌లో తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన నుంచి 3.65 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.4వేల వరకు ఉంటుందన్నారు. అదేవిధంగా తిర్పెల్లికి చెందిన కఠోర శుభం ఇంట్లో మద్యం విక్రయిస్తుండగా ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన నుంచి 3.42 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీటి విలువ రూ.3762 ఉందని వివరించారు.

అసభ్యపదజాలంతో దూషించిన వ్యక్తిపై..

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో కాంగ్రెస్ నాయకులను దూషించిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈనెల 16న వాట్సాప్ గ్రూప్‌లో కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి అసభ్య పదజాలంతో పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన శైలేష్ బొత్కుర్‌వార్ దూషించినట్లు యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేశ్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. నాయకుల వ్యక్తిత్వాన్ని కించపర్చడంతోపాటు ప్రజలను రెచ్చగొట్టేలా పోస్టు ఉందని తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

జూదరుల అరెస్టు

దండేపల్లి: మండలంలోని నంబాల గ్రామ సమీపంలో గురువారం నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7500 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని జైలుకు తరలిస్తున్న ఎస్సై

బెల్లంపల్లి: చోరీ కేసులో కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. టూటౌన్ ఎస్సై కె.మహేందర్ కథనం ప్రకారం.. 2022లో టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో దొంగతనం జరిగింది. చోరీ కేసులో నిందితుడిగా ఉన్న పంజాబ్ రాష్ట్రానికి చెందిన హరదీప్‌సింగ్ కొంతకాలం నుంచి కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. నిందితుడి ఆచూకీని కనుగొని పోలీసులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో చాకచక్యంగా పట్టుకుని గురువారం బెల్లంపల్లి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. అనంతరం ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దేశీదారు విక్రయిస్తున్న ఇద్దరు..



దేశీదారు, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

తాంసి: అక్రమంగా మహారాష్ట్ర నుంచి దేశీదారు తీసుకువచ్చి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రేండ్ల విజేందర్ తెలిపారు. మండలంలోని లీంగూడ గ్రామానికి చెందిన ఆత్రం దేవ్‌రావు, టేకం బర్కత్‌రావులు మహారాష్ట్ర నుంచి దేశీదారు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పక్కాసమాచారం మేరకు సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి దాడి చేశారు. మద్యం విక్రయిస్తుండగా ఇద్దరిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10వేల విలువ గల 90 ఎంఎల్ కలిగిన 280 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా దేశీదారు, నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది శ్రీధర్, హనుమంత్ పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు..

నేరడిగొండ: మండలంలోని లింగట్లలో కొందరు గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం మేరకు ఇచ్చోడ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జుల్ఫేఖార్ అహ్మద్ సిబ్బందితో గురువారం తనిఖీ నిర్వహించారు. సాబ్లే రంజిత్, సాబ్లే సంజీవ్‌లు గంజాయితో పట్టుబడ్డారు. రంజిత్ వద్ద సుమారు 184 గ్రాముల డ్రై గంజాయి, సంజీవ్ వద్ద 223 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎవరైనా గంజాయి అమ్మినా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇళ్లపట్టాలు ఇప్పించాలి



ఎమ్మెల్యే వినోద్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి నివాసం ఉంటున్న పుర ప్రజలకు జీవో నెంబర్ 76 ప్రకారం ఇళ్ల పట్టాలు ఇప్పించాలని సీపీఐ నాయకులు కోరారు. గురువారం ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు ఎ. వెంకటస్వామి, బి.పూర్ణిమ, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు ఆడేపు రాజమౌళి, బి.లక్ష్మీనారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల రాజేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల నుంచి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: వచ్చే విద్యా సంవత్సరం 2025-26కు గాను రెప్యూటెడ్(కార్పొరేట్) జూనియర్ కళాశాలల పథకం కోసం జూనియర్ కళాశాలల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగులు, మైనారిటీ విద్యార్థులకు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించేందుకు జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి రెప్యూటెడ్ జూనియర్ కళాశాలను నూతనంగా ఎంపిక చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

దానాపూర్ ఎక్స్‌ప్రెస్ పొడిగింపు

బెల్లంపల్లి: దానాపూర్ ఎక్స్‌ప్రెస్ (నెం.07419/20) రైలు గడువును రైల్వే శాఖ గురువారం పొడిగించింది. స్పెషల్‌ట్రైన్ ప్రస్తుత కాలపరిమితి ఈనెల 17 వరకు ఉండగా ఈనెల 28వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సమ్మర్ స్పెషల్ ట్రైన్‌గా నడిపించనుంది. ఈనెల 19న చర్లపల్లి నుంచి ఈ రైలు బయల్దేరనుంది. అదేతీరుగా 21న దానాపూర్ నుంచి చర్లపల్లికి రిటన్ అవుతుంది. కాజీపేట్-బల్లార్షా సెక్షన్ పరిధిలో ఈ రైలు కాజీపేట్, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా జంక్షన్‌లో ఆగుతుంది.